# ఇంకా వెనక్కి




కె.కె. భాగ్యశ్రీ

ఆ రోజు సైతం పశ్చిమాకాశంలో కెంపుల పోకలను, అందులోని తళుకులనూ చూస్తూ పరమానంద భరితురాలైపోతోంది రసమయి.

అందమైన చిన్న, చిన్న పక్షులు కువకువలాడుతూ అంతులేని సంతోషంతో గూళ్ళకు చేరుకుంటున్నాయి. వాటి సంతృప్తికి కారణం!? ఓహ్! తల్లికి తన కడుపు పంటపై ఎంత మమకారం! రెక్కలొచ్చేదాకా వాటిని పెంచాలన్న ఇంగిత జ్ఞానం, బాధ్యత, నోరులేని ఆ విహంగాలకు సైతం!!

ఈ భావన హృదయాన్ని సుతిమెత్తగా స్పృశించి ఒకరకమైన సుందరత్వంతో ఆపాదించుకున్న అలజడిని సృష్టించాయి.

చిన్న పెన్సిల్ గీతను డార్క్ చేస్తూ చివరికి ఇండియన్ ఇంక్‌తో బ్లాక్ చేసినట్లుగా-చీకటి సన్న సన్నగా మొదలై కాటుకలా మారింది.

మేడమీద ఒంటరిగా ఉన్న రసమయికు స్కూటర్ మీద వస్తున్న భర్త కమల్ కనిపించాడు. ఆమె ఎద భర్త రాక కోసం ఎదురు చూడడంలో నిమగ్నమై ఉండటం వలన చూసీ చూడడంతో ప్రఫుల్లమైంది.

వడివడిగా మెట్లు దిగేద్దామనుకుని ఏదో గుర్తుకొచ్చి ఒక్కొక్క అడుగు నెమ్మదిగా వేసుకుంటూ క్రిందికి దిగింది రసమయి.

"హాయ్! రసమయా!" అంటూ గదిలోకి రావడంతోటే ఒక్క వుదుటన్న వాటేసుకుని ముద్దెట్టుకున్నాడు కమల్.

"ఇదిగో మిమ్మల్నే! మీరంత హఠాత్తుగా మీద పడితే నామాట దేవుడెరుగు. మనబాబు ఓర్చుకోలేక..." అంది గుసగుసగా.

"సారీనోయ్! ఓయ్ పుట్టబోయే బాబూ! నన్ను క్షమించు. నీకేమైనా బాధ కల్గిన యెడల..." అని విడివిడిగా పదాలన్నీ ఒత్తి పలికి చెప్పడంతో భర్త చేష్టలు నవ్వు తెప్పించాయి.

సుడిగాలి తాకిడికి ఝల్లున రాలిన పొగడ పూలలా కురిసాయి నవ్వులు.

ఆ నవ్వులు విని ప్రత్యక్షమైంది భద్రమ్మ. "అమ్మా కోడలా ఆపు. అలానవ్వితే నరాలన్నీ కదిలిపోతాయి. బిడ్డడికెంత బాధ... ఈసారెపుడూ అలా నవ్వకమ్మా!" అని అంతటి ఆనందానికి అడ్డుకట్ట వేసింది.

ముఖంలో అదో విధమైన ఛాయ ఏర్పడింది. హాయిగా నవ్వుకుందుకి హక్కులేదు ఈ యింట్లో అనుకుంది.

నిజానికి దేవుడు ప్రసాదించిన వరం భర్త కమల్. జీవితంలో మంచి భర్తను, పొందిక గల సంసారాన్ని, వీటిని కోరుకోవటం స్త్రీ కనీసపుటాశలు.

తను కోరుకున్న కనీసపుటాశ కంటే భర్తతో ఎన్నో సుకరమైన, హృద్యమైన కోరికలనే పండించుకుంది. తనేది కోరితే అదిచ్చే ప్రేమతత్వం గల మనిషి కమల్. కానీ అతని బలహీనతను ఆసరాగా చేసుకుని గొంతెమ్మ కోరికలు కోరలేదు. తను. అందుకు భర్త మనుసు నిండా గూడు కట్టుకుంది. ఆ గూటిలో ఎన్నో అనుభవాలను దాచుకుంది.

దాని ఫలితమే ఓ ప్రాణి ఊపిరి పోసుకోబోతుంది.

తల్లిలేకున్నా కన్న తల్లిలా సాకి పెంచిన మమత

లున్న తండ్రి కరుణయ్య ఈ విషయం తెలిసి ఉప్పొంగిపోయాడు. పెండ్లయిన సంవత్సరానికే తాత కాబోతున్నందుకు తను బ్రతికుండగానే వాడి అల్లరి చేష్టలు కళ్ళారా గాంచాలని, తమింట ఓ బిడ్డడు దోగాడాలని నిండైన ఆశలు నిజమౌతున్నందుకు కడుపునిండిపోసాగింది కరుణయ్యకు.

రసమయ జ్ఞాపకాల్లో తండ్రి కళ్ళుగట్టాడు. కళ్ళల్లో చిప్పిల్లాయి కన్నీళ్ళు.... హృదయంలో చిప్పిల్లింది అనురాగం.

చాలా కాలమైంది. నాన్నను చూసి... ఎలా ఉన్నాడో... అక్కడా పల్లెలో ఒంటరిగా... పాపం నాన్న... జీవితంలో ఎక్కువగా ఒంటరిగానే గడిపారేమో!

నాన్నొస్తే బాగుణ్ణు!!

ఆ రోజులో ఎన్ని సార్లు తలచిందో రసమయి... ఆమె తలపు ఫలించినట్లుగా రాత్రి బస్సులో వచ్చాడు కరుణయ్య. తండ్రిని తనివి తీరా చూసింది. తన పెళ్ళయిన దగ్గర్నుండి బాగా మారిపోయారు. నీరసంగా పేలవంగా ఉన్నారు.

తండ్రిని చూడ్డంతో గట్టిగా ఏడవాలనిపించింది. కానీ గుండెల్లోనే దుఃఖం దిగమ్రింగుకుంది.

"నాన్నా!" ఆర్తి అధికంగా ఉందామె కంఠంలో.

"చాలా కాలమైంది కదమ్మా! బాగున్నావా తల్లీ!" అని నోరారా పలుకరిస్తుంటే తండ్రి చల్లని చూపుతో వరాలు ప్రసాదించే దేవుడిలా కనబడ్డాడు.

మామగార్ని ఆదరంగా లోనికి తీసుకువెళ్ళాడు కమల్.

భద్రమ్మ అతని రాకలోని భావాలను బేరీజు వేస్తోంది.

పద్మనాభయ్య కాళ్ళు కడుక్కుందికి నీళ్ళందించాడు.

భోజనాలయిన దాకా ఆ మాట, ఈ మాటతో గడిపారు. చివరికి కమల్‌ను దగ్గర పెట్టుకుని తనొచ్చిన విషయం ప్రస్తావించడం ప్రారంభించాడు కరుణయ్య.

"భద్రమ్మక్కా! ఇంతకాలానికి పండంటి బిడ్డడు పుట్టబోతున్నాడంటే నాకంటే మీకెక్కువ ఆనందం కలిగిస్తుందని నాకు తెలుసు. అయితే తల్లి లేని పిల్లను పెంచినా దాని అచ్చట ముచ్చట తీర్చాల్సిన బాధ్యత నాది. అందువల్ల మీరు పిల్లను నాతో పంపిస్తే బాగుంటుంది. దాని పురుడొచ్చేదాకా చూసుకునే పూచి నాది. ఒక నెల ముందే హాస్పిటల్లో జాయిన్ చేస్తాను" అన్నాడు.

అందరి మొహాలు చిత్రమైన అలజడితో ముప్పిరిగొన్నాయి.

"బావగారూ! మీరన్నది చాలా మంచి మాటే కావచ్చు. కానీ మా ఇంటి ఆచారం ప్రకారం ఈ ఇంట్లోనే, మాకు అచ్చొచ్చిన పురిటి మంచం మీదే పోసుకోవాలి. అదే శ్రేయస్సు. అందుకని పంపడం సాధ్యం కాదు" అని మొహమాటపడకుండా అనేసాడు పద్మనాభయ్య.

"అంతేకాదు తమ్ముడా! మా ఇంటి నమ్మకాలను బట్టి ఈ ఇంటి పురుళ్ళు డాక్టర్ పరీక్షకి వెళితే పురుడు పోవడం ఖాయం. అందువల్ల డాక్టర్ల బాధలేదు. పైగా ఎన్ని పురుళ్ళు, పుణ్యాలు జరిగాయో... అన్నీ మంత్రసాని మంగమ్మే నెట్టుకొచ్చింది... దానికి తెలిసింది ఈ డాక్టర్లకేం తెలుసని... ఎప్పుడు పురుడొస్తుందో...ఏ బిడ్డపుడతాడో అన్నీ ఇట్టే తేలుస్తుంది. ఆరు నూరయినా ఈ గడప నుండి కాలు కదపడానికి వీలు లేదు..." కర్ర విరిచినట్లు చెప్పేసింది భద్రమ్మ.

"అదికాదక్కా! ఒకే ఒక బిడ్డ! నా తృప్తి కోసం..." తటపటాయిస్తూ అడిగాడు కరుణయ్య. "మరేం మాట్లాడడానికి వీల్లేదు తమ్ముడూ! తరతరాలుగా వస్తున్న వంశాచారం ప్రకారం ఈ పురుటి మంచం పైనే పురుడవాలి. పైగా మీకు ఆడదిక్కులేదు. డాక్టర్లంటూ పట్నాలు తిప్పితే ఈ ఇంటికి అచ్చిరాదు. పైగా నానోటంట ఆ అపభ్రంశపు మాట రానీకండి..." అని నోరు నొక్కుకుంది భద్రమ్మ.

గుడ్లనీరు గుడ్లలో గూడు కట్టి వుంచటానికి ప్రయత్నం చేసినా విఫలమైంది. కూతురితో ఒంటరిగా తన బాధను వెళ్ళబోసుకుందుకు వీల్లేక పోయింది కరుణయ్యకి.

### తక్షణ వైద్యం

కూరగాయలు తరిగేటప్పుడు గానీ మరెపుడైనా చేతులకి చిన్న చిన్న గాయాల్లాంటివి తగిలితే బెంబేలు పడుతూ సమయాన్ని వృధా చేయవద్దు. వెంటనే తాజాగా ఉన్న పచ్చిబంగాళ దుంపని అడ్డంగా కోసి ఆ ముక్కని గాయం మీద అద్దుతుంటే కొంతవరకు ఉపశమనం కలుగుతుంది.

-లో. శ్రీ

తెల్లారి లేచి తండ్రి వెళ్ళిపోతుంటే, హృదయంలో గునపాలు దించినట్లయింది రసమయకు.

•••

కమల్ ఉన్నంతసేపూ చాలా హుషారుగా, సర్దాగా గడిచిపోతుంది రసమయకు. అతను ఆఫీసుకు వెళ్ళిపోయిన మరుక్షణం ఒంటరిగా ఏదో కోల్పోయినట్లుగా డస్సి పోతుంది.

భద్రమ్మ ఏదో ఒక పురాణం పట్టుకుని కూర్చుంటుంది.

పద్మనాభయ్య తనకు వచ్చిన రాగాలను వచ్చీ రాని హార్మోనియం వాద్యంపై వేధిస్తాడు. ఎటైనా వెళదామంటే భద్రమ్మ అనుమతించకపోవడమే కాక ఉరిమి చూస్తుంది. ఆ రోజు కమల్ ఆఫీసుకి వెళ్ళిపోయాడు. ఒంట్లో నలతగా ఉండి, పత్రిక తిరగేస్తూ పడుకుంది రసమయ. అందులో ఓ అడ్వర్టయిజ్‌మెంట్ దగ్గరకొచ్చేసరికి కళ్ళు ఆకర్షణతో అతుక్కుపోయాయి. బొద్దుగా, గులాబీ రంగు బుగ్గల్లో... నిండుగా నవ్వుతూ...

ఓహ్! స్త్రీకి మాతృత్వం మహావరం. సహజంగా అది ప్రాప్తించటం ఆడదాని అదృష్టం. భగవాన్! తనక్కూడా అటువంటి బాబుని ప్రసాదిస్తావు కదూ!

ఆ బాబు ఫోటో చూస్తుంటే నిజంగానే తన కనుల ముందర నుండి బుడి, బుడి నడకలు నడుస్తున్నట్లు.. ఒళ్ళో చేరి చిట్టి చిట్టి పాదాలతో గుండెల మీద సుతి మెత్తగా గుద్దుతున్నట్లు, తన వేళ్ళని పిడికిట్లో బిగించి వదలనట్లు...బోసి బోసి నోటితో, అల్లరి అల్లరి అరుపులు...

ఇవన్నీ మనోయవనిక మీద ఇంద్రధనుస్సులా విశ్లేషిస్తూ ఆవరించుకున్నాయి.

సంతోషంతో-కనుల్లో సన్నగా తడి...

అలా యోచనల్లో వుండగానే 'పోస్ట్' కేకవిని పరిగెత్తింది.

"అంతపరుగెందుకమ్మా! నిండుచూలాలివి..." భద్రమ్మ హెచ్చరిక.

మెల్లగా వెళ్ళి ఉత్తరం అందుకుని గదిలోకి వెళ్ళాక విప్పింది. రజిత రాసింది.హాస్టల్ మేట్...

"రసమయా! హౌ ఆర్యూ! నేను ఫైన్... ఒక్క ఫైనే కాదు.. ఒకఫైన్ అయిన బిడ్డడ్ని ఈ భూమ్మీద పడేసి జనాభా సమస్యను జటిలం చేసే ఉద్యమానికి ఉపక్రమిస్తున్నాను. నా ఈ ఉద్యమానికి సహకరించే మా ఆయన, ఆడబిడ్డలు, అత్తమామలు అంతా నా అడుగులకు మడుగులొత్తి నేనేదంటే అది చేసి పెడుతున్నారు. మరి నువ్వు నాలాంటి ఉద్యమాలేమైనా ప్రారంభించావా లేదా! అలాంటి ఉద్యమాలేమైనా చేపట్టావా లేదా! అలాంటి ఉద్యమాలే కనుక చేపట్టినట్లయితే ప్రతిక్షణం డాక్టర్ల చేత చూపించుకోవడం అవసరం... వారం ముందరే హాస్పిటల్లో జాయిన్ చేస్తారట నన్ను. ఎందుకంటే తొలి ప్రసవం కష్టం కావచ్చునట అందుకే ముందే మేలుకోవడం మంచిది. మరేం విశేషాలు లేవు. బాబు పుట్టాకనే విశేషం.

ఇట్లు నీ ప్రియ

'రజిత'

ఆ సారాంశం రసమయను వెక్కిరించింది. మరో విధంగా హెచ్చరించింది. ఒకరి ఆనందం, అంతస్తు మరొకరి గుండెల్లో కార్చిచ్చు రేపటానికి ఈ సంఘటనే ఉదాహరణ కావచ్చు. తానొక నిండైన ప్రాణికి ఊపిరి పోసే కర్ర. కానీ ఆ కర్రనే ఖర్మానికి వదిలేసే క్రియలు చేస్తున్నారు, వాళ్ళు. పొట్టలో పసికందు ఆరోగ్యంద్రుష్ట్యా టానిక్కులు కావాలంది. తన భయం కొద్దీ డాక్టరు దగ్గర పరీక్ష చేయించమంది. కానీ రెంటినీ కమల్ పట్టించుకోలేదు.

అన్ని ప్రేమలను పరమాన్నంలా అందించే కమల్ ఎందుకలా ప్రవర్తిస్తున్నాడో అర్థం కాక ఒక రోజు నిలదీసింది.

దానికి జవాబుగా కమల్ అన్నాడు-"రసమయా! ఈ కుటుంబం గురించి, దాని నమ్మకాల గురించి నీకు తెలీదు. ఒకప్పుడు ఈ ఇంట్లో ఓ బామ్మగారుండే వారట. ఆవిడకి ఒకే ఒక్క కూతురు

ఉండేదిట. చాలా అపురూపంగా చూసుకునేది బామ్మ! చివరికి కూతురు గర్భిణీ అయింది. అవిడకీ డాక్టర్స్‌కంటే ఇంట్లో మంత్రసాని చేత పురుడు పోయించడమే ఇష్టమనిపించింది. కానీ అల్లుడు వినకుండా హాస్పిటల్‌లో జాయిన్ చేసాడుట. హాస్పిటల్‌లో బిడ్డ, తల్లి కూడా మరణించారుట. ఆనాటి నుండి ఎవరి పురుడు హాస్పిటల్‌లో జరిగినా ప్రాణం పోవటం జరిగింది. తరువాత ఒక తాంత్రికుడు మా ఊరు వచ్చి మా ఇంట్లో ఒక యంత్రం స్థాపించి దానికి పూజా పునస్కారాలు చేసాడు. ఒక మంచం చేయించి దానికి తాయెత్తులు అవీ కట్టి జపాలు జరిపాడు. తరువాత దాని మీద ఎవరు పురుడు పోసుకున్నా సరే క్షేమంగా ఉన్నారు. ఇదీ ఆచారం. నీమీద ఇష్టం లేక కాదు. డాక్టరంటే మాకు అచ్చిరాదు" అని మొత్తం వివరిస్తూ అవగాహన పరచటానికి ప్రయత్నిస్తున్నట్లు మాట్లాడాడు. భర్త ఎంత చెప్పినా మనసులో వెత, వెలితి అలాగే ఉండిపోయాయి. పురుటి నొప్పులు చాలా తీవ్రంగా ఉంటాయిట. స్త్రీ ఆ నరకం భరిస్తే మరో జన్మనెత్తినంత ఫలితం అంటారు.

కాని తనకు ఏ క్షణం పురుడొస్తుందో ఎవరికి తెలుస్తుంది. తనే నిద్రలో ఉండగానో, ఏ అర్ధరాత్రో తనకి నొప్పులు ఆరంభమైతే... ఎంత ఘోరమైన పరిస్థితి ఏర్పడుతుందో తలుచుకుంటుంటే ఒళ్ళు జలదరించింది.

ఇటువంటి యోచనల నడుమ నలిగిపోతుంటే– "అమ్మా! రసమయా! ఇట్లారా! మంగమ్మొచ్చింది" అని పిలవగానే కదిలింది.

మంత్రసాని మంగమ్మ జుట్టంతా జడలు కట్టింది. వెలిసిపోయి కుళ్ళోడిన బట్ట... నోట్లో చుట్ట అడ్డపొగవేసింది.

"ఇట్లారామ్మా!" అని తనకు తెలిసిన నాటు పరీక్షలు జరిపింది అక్కడినుంచే తుపుక్కున ఉమ్మేసి చేత్తో చుట్టపట్టుకుంది.

"భద్రమ్మగోరూ! వచ్చే అమావాసెల్లిపోతేగానీ పురుడ్రాదు. గాబర్నేదు... నేనీ మద్దెన సికాకులం ఎల్లొస్తా..." చెప్పింది.

"ఒసే మంగీ! నువ్వు శ్రీకాకుళం వెళ్ళి మకాం పెట్టేయకుమీ!" ముందస్తుగానే హెచ్చరించింది.

మంగమ్మ వెళ్ళిపోయింది.

రసమయ ఆలోచనల వ్యూహంలో ఇరుక్కుపోయింది. ఒకటికి పదిసార్లు రజిత రాసిన ఉత్తరం కనుల ముందర పల్టీలు కొడుతూంది. అపుడపుడు కమల్ పంచుకున్న తీయని అనుభూతులు నెమరుకొస్తున్నాయి.

ఎంతో ఆధునికంగా, వైజ్ఞానికంగా ఎదిగిన ఈ దేశంలో మూఢనమ్మకాలింకా–రాజ్యాలు పతనమైనా, కోటమొండి గోడల్లా శేషమున్నాయి. వాటని పునాదుల నుండీ పెకలించేవారే లేరా!

హే భగవాన్! ఏమిటీ విపత్కర పరిస్థితి!!

లేకుంటే... ఈ ఇంటి నమ్మకాలు... అచ్చిరావటాలు... అర్థం పర్థం లేని ఆచారాలు ఏమిటసలు??

•••

"ఏంతెచ్చానో చూడు!!" అన్నాడు కమల్.

తనకిష్టమైన మల్లెదండల్ని మురిపెంగా చూస్తూండిపోయింది. కానీ మానసికంగా ఏదో లోటు...

"ఏమండీ! నాకేదో భయంగా ఉందండీ! దయ చేసి నన్నోసారి డాక్టర్ దగ్గిరకి తీసుకెళితే..." ఎంతో ప్రార్థనా పూర్వకంగా చెప్పింది.

"రసమయా! నీకెంత చెప్పినా బోధపడదు. ఈ ఇంటి ఆనవాయితీ ప్రకారం నడుచుకోకపోతే బలై పోయేది మనమే! అయినా డాక్టర్ దగ్గరకెళితే అచ్చిరాదన్న విషయం మన పెద్దలు తీర్మానించారు. పాటించడం మనవిధి." ప్రతి పలుకు ఒత్తి ఒత్తి పలుకుతున్నపుడే అతని గుండెల మీద పురాతన భావాలెంతగా ముద్రపడిపోయాయో అర్థమయ్యేసరికి రసమయ గుండెలు నీరయిపోయాయి.

> **ఒంటికాలి తపస్సు!**
>
> ఒంటి కాలి మీద నిలబడి తపస్సు చేసి భగవంతుని ప్రత్యక్షం చేసుకుని కోరికలు తీర్చుకున్న వారి కథలు చదివాము.
>
> కానీ అలా ఒంటికాలిమీద 34 గంటల సేపు నిలబడి ప్రపంచ రికార్డు సృష్టించాడు ఒక బారతీయ యువకుడు. కోయంబత్తూరుకి చెందిన ఈ యువకుని పేరు యన్. రవి.

"డియర్ ఏ బెంగలు పెట్టుకోకు, నాకు క్యాంపుంది... వెంటనే వెళ్ళిపోవాలి. రేపు సాయంత్రానికి కాని రాను." అని ఎకాఎకిన బయలుదేరాడు.

కమల్ వెళ్ళిన రెండు నిమిషాలకు పద్మనాభయ్య పొరుగూర్లో రైతుల దగ్గర పనుందని వెళ్లాడు. మిగిలింది భద్రమ్మ. ఆవిడ కూడా ఓపిక లేనట్లు నడుం వాల్చి నిద్రాదేవితో కుస్తీలు పడుతోంది. పరిస్థితి తెలిసింది. రసమయకు. క్షణాల్లో నిద్రాదేవిని కౌగిలించుకుంది అత్తగారు. ఆ ఘడియే రసమయ హృదయంలో పెన వేసుకున్న కోరిక మొదలైంది. ఎలాగయినా దగ్గర్లో డాక్టర్ని కలవాలని... అనుకున్నదే తడవుగా తలుపులు ఓర వాకిలిగా వేసి బయలు దేరింది.

డాక్టర్ రత్న, గైనకాలజిస్టును కలిసింది. తన అనుమానాలన్నీ నివృత్తి చేసుకోవాలని రక రకాల ప్రశ్నలు వేసింది. అన్నింటికీ చాలా సౌమ్యంగా జవాబులిచ్చింది.

చివరిగా అంది–"బిడ్డ మొదటి కాన్పులో అడ్డం తిరిగే సూచనలున్నాయి. కాబట్టి ఆసుపత్రిలో జాయినయి పురుడు పోసుకోవడం చాలా ముఖ్యం. లేకుంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది." అని ఓ డాక్టర్‌గా బాధ్యతతో చెప్పింది రత్న.

ఆమె ముందర ఇంటి విషయాలు విశదీకరిస్తే బాగోదని వెనుదిరిగింది. ఇంకా భద్రమ్మకు తెలివి రాలేదు. మామగారొచ్చిన అలికిడి కూడా లేదు. డాక్టర్ మాటలకు ముచ్చెమటలు పోస్తున్నాయి. ఒకటే అదురుగా ఉంది. తానొక ఘోర ప్రమాదంలో ఇరుక్కోబోతోంది. ఈ విషయం ఇంట్లో చెపితే ఒక ప్రళయం... చెప్పకపోతే ఒక ప్రళయం...

ఎటూ ఆలోచించుకోలేకపోతోంది.

మర్నాడు కమల్ వస్తూ పలుకరించినా మిడిగుడ్లు వేసుకుని ఉండిపోయిందే కాని మారుమాట్లాడలేక పోయింది. భర్తను చూస్తూనే వెక్కి వెక్కి ఏడ్చేసింది.

ఎందుకేడుస్తున్నావని ఊరడించాడు కమల్.

తన క్షేమం కోరి డాక్టర్ చెప్పిన విషయం చెవిన వేసింది.

"రసమయా! ఎంత పని చేసావు! ఛ! మన ఇంటికి అప్రదిష్ట తెచ్చే పని చేసావు." అని భార్యపై కేకలేశాడు. భద్రమ్మ ఈ కేకలకి వడివడిగా వచ్చి వివరం కొడుకు ద్వారా తెలుసుకున్నది.

"అవ్వవ్వ!! ఎంత ఘాతకానికి ఒడిగట్టావే! చక్కగా తరతరాలుగా అందరినీ చల్లగా కాపాడే మన ఇంటి పురుటి మంచం మీద హాయిగా పురుడోసుకోక ఎందుకే ఈ వెర్రి చేష్టలూ..." భద్రమ్మ ఆరవనే అరిచింది.

పద్మనాభయ్య కూడా పాలు పంచుకున్నాడు.

అంతటితో ఆ రగులుకున్న మంట చల్లారలేదు.

చేసిన పనికి శిక్షగా రసమయ నోటికి కూడులేదా రోజు.

రెండు రోజులు ముభావంగా గడిచాయి

ఓ మంచి ముహూర్తానికి పురుటి మంచం బయటకు తీయించి దాన్ని క్రొత్తగా నేయించింది భద్రమ్మ.

మంగమ్మ అంచనాల ప్రకారం రెండురోజులలో పురుడు రావచ్చునంది.

ఆ రోజు రానే వచ్చింది.

రసమయ గుండెలు గుభేల్‌మనసాగాయి.

వారి మూర్ఖత్వానికి కళ్ళనీళ్ళు పెట్టుకుందే కానీ ఏం చేయలేక పోయింది.

మాతృత్వ బంధం ఎంతో తీయని అనుభూతిని ప్రసాదించవలసింది పోయి క్షణ క్షణం భయం సృష్టిస్తూంది.

మంత్రసాని మంగమ్మ తన చేతకాని తనాన్ని దేవుడి మీద భారంగా వేసింది.

వేటగాడి బాణానికి విలవిలలాడి మెడవేలాడేసిన పసి కూనలా గిలగిల్లాడి ఈ లోకం వీడింది రసమయ.

ఆ ఇంట్లో జరిగిన, ఘోరానికి విలపించారు.

కాని! వారి విచారం–పురుటి నొప్పులతో యమ యాతనను అనుభవించి తల్లడిల్లిపోయి ప్రసవం కాక శవమైనందుక్కాదు.

డాక్టర్లంటే తమింటికి అచ్చిరాని విషయం అని తెలిసికూడా పరీక్ష జరిపించుకున్నందుకు స్వయం కృతాపరాధంగా రసమయ బలయిపోయిందని!